సృష్టిలో తియ్యనిది

శ్రీ వాకాటి పాండురంగరావ్

1

అలవాటు ప్రకారం సాయిబాబు ఆ సాయంకాలం తన పెట్టె తెరిచాడు. బట్టలన్నిటినీ పక్కకు తొలగించి ఒక ఫోటోను తీసి చేతిలో ఉంచుకున్నాడు; ఓ నిముషం చూశాడు. 'చూసి రెండు నెలలయింది ....' అనుకున్నాడు. ఆ ఫోటోను పెట్టేసి బట్టలు సర్దిపెట్టెను మూసేశాడు.

మూస్తుండగా ఏదో అలికిడయినట్లనిపిస్తే తిరిగి చూశాడు. మహాలక్ష్మమ్మ నిలబడిఉంది .... పాతికేళ్ళు దాటని మహాలక్ష్మమ్మ. పగలు ఏడింటినుండి రాత్రి పదింటిదాకా తన సూనె కొట్టులోనే తేలిమునిగే నరసయ్య అర్ధాంగిని మహాలక్ష్మమ్మ.

ఆమె తన గదిలోకి అంత చొరవగా రావడం సాయికి ఆశ్చర్యం కలిగించింది. ఇందాకట్నుంచీ ఆమె ఇక్కడే నిల్చుందేమో .... సాయికి కొద్దిగా కోపం కూడా వచ్చింది.

"ఏం కావాలండీ ?"—కాస్త కటువుగానే అడిగాడు.

మహాలక్ష్మమ్మ నవ్వింది.... "అబ్బే—ఏమీ వద్దండీ .... ! ఆ ఫోటో మీ ఆవిడదా .... ?"

"ఆ !"

"మీకు పెళ్లి కాలేదన్నారు ?"

"అవును, కాలేదు .... "

మళ్లా నవ్వింది మహాలక్ష్మమ్మ—"భలేవారే ! .... పెళ్లి కాలేదంటారు. పెళ్లాం ఫోటో ఉందంటారు ...." అంటూ వచ్చి మూల ఉన్న పేము కుర్చీలో కూర్చుంది. సాయికి మహా చిరాకుగా ఉంది. మరొకరయితే తక్షణమే గది బయటికి వెళ్లిపొమ్మనవచ్చు .... ఈవిడ ఎవరో కాదే .... సాక్షాత్తూ ఇల్లుగలావిడ .... తాను ఈ క్రొత్త వూళ్లో, ఉద్యోగానికి వచ్చి, హోటలులో దిగి, ఒక గదికోసం వెతుకుతున్నప్పుడు, చాలామంది యజమానులు బ్రహ్మచారికి గది అద్దె కివ్వడానికి నిరాకరించినప్పుడు, ఈ యింటి నరసయ్య కూడా కాస్త తటపటాయించినప్పుడు, భర్తకు నచ్చజెప్పి తనకీమాత్రం వసతి నిప్పించినావిడ .... ఈవిడని వెళ్లిపొమ్మని ఎలా చెప్పడం ?

"ఏదో ఆలోచిస్తున్నట్లున్నారు ? .... నే వెళ్లిపోతాలెండి .... " అని లేవబోయింది....

"అబ్బే .... ఆలోచన ఏమీలేదు లెండి—" అన్నాడు సాయిబాబు.

మహాలక్ష్మమ్మ మళ్లా కూచుంది.

కూచుని చెప్పింది : " నేనా ఫోటోను గురించి అడగడం తప్పేమో ? ఏమీ అనుకోకండి. పనిమనిషి వెంకటమ్మ ఒకటి రెండుసార్లు చూచినట్టుంది. నాతో చెబుతే, ఏదో కుతూహలంకొద్దీ .... "

సాయి ఆశ్చర్యం పెద్దదయింది.

పనిమనిషి చూసి ఈవిడతో చెప్పిందా ? కొన్ని కొన్ని విషయాలు ఎలా రెక్కలమీద పరుగెడతాయో !! ఇంకా నయం. .... ఆ ఫోటో తాను ఉంచుకున్న సానిదానిదనీ, దానికోసం తన జీతమంతా తగలేస్తున్నాననీ పాకి పోలేదు .... అలాగనక ప్రచారమయిందా, తా నిహ కాదనలేడు. అప్పుడు తాను రోడ్డంబట వెళ్తుంటే కొన్ని వింత దృష్టులు తనమీద ప్రసరించేవి కాబోలు ! 'నిప్పు లేనిదే పొగ రాదులెండి'—అని కొందరు ఆర్యులు భాష్యం చేసేవాళ్ళ కాబోలు !

—అనుకుంటూ పెట్టె తెరిచి ఆ ఫోటోని తీశాడు సాయి.

ఆ ఫోటో మూలలలో ఒకటి నలిగినట్లుంటే దానిని కొన గోటితో అతి జాగ్రత్తగా సరిచేసి, అరచేత నుంచుకొని ఓసారి చూశాడు .... హఠాత్తుగా మహాలక్ష్మమ్మకి ఆ ఫోటోను అందిచ్చాడు.

అతడి చేయి ఆమె చేతికి తగిలింది. కాని అది తెలుసుకుని ఝల్లుమన్నది ఒక్క మనసే. ఆ జల్లు ఆగిన మరుక్షణం ఆమె వద్న ఆశ్చర్యానికి అంతులేదు. మళ్లీ మళ్లీ చూసింది ఆ ఫోటోను !

అక్కడ—సాయిబాబు వయసువాడే—ఒక యువకుడి మొహం ఉంది. అతడి కళ్లలో ప్రశాంతమయిన ఆకర్షణ, అయస్కాంతంలా వెలుగుతూంది.

సాయిబాబు మహాలక్ష్మి మొహాన్ని గమనిస్తున్నాడు.

"ఇతడు మీ అన్నయ్యా ? తమ్ముడా ?" అని ప్రశ్నించింది ఆమె.

"అతడు నా మిత్రుడు—" అన్నాడు సాయి .... ఆ మాటలు చెప్పలేని భావసముద్రాన్ని వాటిలోకి వృధాగా పొందుపరుస్తూ—

"మీ రివాళ రాత్రి మా ఇంటో భోంచేయకూడదూ ?"

"అబ్బే ఎందుకులెండి—"

"మావారు ప్రక్క వూళ్లో పెళ్లికి వెళ్లారు. రాత్రికి నే నొక్కర్తినే భోంచేయాలి—"

"ఇంకెపుడయినా ..... "

"మీ కులంవాళ్లం కాదనా .... ?"

"అది కానే కాదండి—"

"మీ యిష్టం ...." అని లేచి గుమ్మందాకా నడిచి, తిరిగిచూసి, నవ్వి— "వస్తా—" అని వెళ్లింది మహాలక్ష్మి.

సాయిబాబులో ఒకటి రెండు ప్రశ్నలు మిగిలాయి. వాటికి జవాబులు వెదకడానికి అతడికి యిష్టం లేకపోయింది.

ఫోటోను భద్రంగా దాచాడు. బట్టలు మార్చుకుని హోటలుకు వెళ్లాడు. భోజనం ముగించుకుని వచ్చి మేడ మెట్లు ఎక్కుతుంటే—'మంచి దినము నేడే—మహారాజుగా రమ్మనావే—' వినబడింది .... మహాలక్ష్మి కాబోలు .... డాబా మీద పడుకున్నాడు. కమ్మని సంగీతంలా గాలి వీస్తోంది. ఆవరించిన ఆకాశంమీద ఎవరో మణులను పారేసుకున్నారు. ఆ మణుల మధ్య చందమామ దొర్లుతున్నాడు.

సాయిబాబు మనస్సు మేఘమై మదరాసు పరుగెత్తింది ......

సముద్రతీరం చేరింది.

అక్కడ, తనూ, రాజా ఎన్నివందల సాయంకాలాలు గడిపారు ! ఆ రోజుల్లో తనకేదీ ఉద్యోగం లేదు. రాజా దిన పత్రికలో ఉంటుండేవాడు; ఇప్పుడూ ఉన్నాడు. తను నాలుగింటికెల్లా సముద్రతీరం చేరుకునేవాడు. అక్కడో చిన్న గుడీ, దానిముందో మంచినీళ్ల బావీ ఉండేవి .... దానికి తిన్నగా నీటి ఒడ్డున కూచునేవాడు. అయిదున్నరకెల్లా రాజా వచ్చేవాడు.

ఎన్ని కబుర్లు ! ఎన్ని అభిప్రాయాలు ! ఎన్ని విమర్శలు .... చుట్టుపక్కల జనాన్నే మరిచిపోయేవారు .... ఒక్కోసారి రాత్రి పదీ పదకొండూ అయ్యేది .... హోటలువాడు భోజనాల టైము అయిపోయిం దనేవాడు.

ఒక్కో సాయంకాలం రాజా—"సాయీ ! .... 'మనసున మల్లెల మాల లూగెనే—' పాడవూ ?" అనేవాడు. అది కాకపోతే 'ఓహో ! విభావరీ .... ' అడిగేవాడు. తనకేమంత గొప్పగా పాడ్డానికి రాదు .... అయినా, ఆకాశం ఒడిలో, అలల సన్నిధిలో, వెన్నెల తియ్యదనంలో, మిత్రుడి సన్నిధిలో— మనసు భాషకందని భావాలను విరజిమ్ముతుంటే—హృదయం అవ్యక్తమయిన ఆనంద భారంతో క్రుంగిపోతుంటే—అలా అలా నెమ్మదిగా పాడుకోవడంకన్న జీవితంలో ఇంకేమీ వద్దనిపించేది. ఎప్పుడయినా తను పాడడానికి జంకితే రాజా అనేవాడు .... "సాయీ ! సృష్టిలో మనిషికి మాట అంటూ వచ్చిన తర్వాత ఉత్తమ పరిణామం, పద్యమూ పాటా. పాడుకో గల్గిన స్వరం ప్రతీవాడికీ అంతో యింతో ఉంటుంది. ఆ ఉద్వేగమూ, ఆ ఆనందమూ తెలిసి పాడుకోవడం .... ఎంతో మధురమయిన అనుభూతి—"

"మరి నువ్వు పాడరాదూ—?" అని తనడిగితే రాజా నవ్వేసేవాడు .... రాజా ఎంత చక్కగా నవ్వుతాడని .... తన కొక్కటే కోపం. లక్షసార్లు చెప్పినా రాజు సిగరెట్లు మానడు కదా. రోజుకోపెట్టె తగలెడతాడు. గట్టిగా తిడితే ఓ నవ్వు పారేస్తాడు. ఏం చెయ్యడమో—?

ఒకసారి .... చంద్రగ్రహణం తెల్లవారుఝామున ఉందనగా ముందర రాత్రే తా మిద్దరూ ఓ జంపకానా, ఫ్లాస్కునిండా టీ, పేక ముక్కలూ, పట్టుకుని సముద్ర తీరం చేరుకున్నారు. దొంగతనంగా రాజు రెండు సిగరెట్టు పెట్టెల్ని పంట్లాం జేబుల్లోకి తోసెయ్యడం తనకు తెలియ దనుకున్నాడు .... బీచి ఒడ్డున కాసేపు యిటూ అటూ తిరిగారు. పది దాటింది ... వ్యాహ్యాళి కొచ్చిన జనం అంతా వెళ్లిపోయారు. ఇహ ఉండలేకపోయిన రాజా సిగరెట్టు వెల్గించాడు. తనేమీ పలక్కుండానే .... రాజా "ఏం చెయ్యను సాయీ ! ఎంత ప్రయత్నించినా మానలేకపోతున్నాను. అయినా మునుపు ఇరవై కాల్చేవాడిని. ఇప్పుడు పదహారే—తెలుసా ?" అన్నాడు.

ఒక దీపంకింద జంపకానా పరుచుకుని పేకాట మొదలు పెట్టారు. మధ్యలో ఒక రిక్షావాలా వచ్చాడు. "రిక్షా కావాలా సామీ ?" అన్నాడు. ఎవరూ జవాబివ్వలేదు. ఈ సారి రిక్షావాడు—"రిక్షా ఎక్కండి స్వామీ ! పొణ్ణు శౌనా బాగుండును ... ఇదు రూపాయలు దా—" అన్నాడు. అంతే ! హఠాత్తుగా లేచి వాడి చెంపమీద ఒక్క టిచ్చుకున్నాడు రాజా. ఆ రిక్షావాడు హడలి పరుగెత్తాడు .... "వెధవలు—మనం ఎవ రనుకుంటున్నాడో—" అంటూ వచ్చి కూచున్నాడు రాజా. ఇంకో అర

గంటలో ఓ పోలీసు జవానొచ్చాడు. తా మిద్దరమూ డబ్బు పెట్టి పేకాడుతున్నామని మందలించడానికి వచ్చినవాడిని ఆటలో మూడోవాడి కింద కూచోబెట్టాడు రాజు.

రిక్షావాడిని కొట్టిన కోపమూ రాజే; పోలీసువాడిని పేకాట లోకి చేర్చిన సౌమ్యమూ రాజే.

అలాటివాడు తన మిత్రుడు .... తమ అనుబంధం మహాలక్ష్మిలాటి మామూలు మనుషుల కెలా తెలుస్తుంది ?

తమాషా ! రాజు ఫోటోని చూసి "మీ అన్నయ్యా, తమ్ముడా ?" అని అడిగిం దావిడ. ఇదివర కిద్దరు ముగ్గురు అలాగే అడిగారు. తమ ఇద్దరిమధ్యా అంత పోలిక లున్నట్లు తనకు తెలియదు. పైపెచ్చు తను రాజుకన్న నాలు గంగుళాల పొడుగు. తన మొహం కోలగా ఉంటుంది. రాజు నవ్వితే అతడి గుండ్రటి బుగ్గలమీద సొట్టలు పడతాయి. ఇటీవలే తన నొక్కుల జుత్తు నెరవడం ప్రారంభించింది. తలంటి పోసు కున్న రోజున రాజు తల నల్లటి పట్టు తివాసీలా ఉంటుంది.... అలాంటప్పుడు మహాలక్ష్మి కాని, మరొక్కరు కాని ఆ ప్రశ్న ఎలా వేస్తారో ? .... రేపు ఉత్తరం రాసేటప్పుడు రాజుకు మహాలక్ష్మి గదిలోకి వచ్చిన సంగతి రాయాలి......

మదరాసువెళ్లిన సాయిమనసు మత్తులో కలిసి పోయింది...

2

—తెల్లవారింది.

సాయిలేచి మొహం అదీ కడుక్కుని ఎలక్ట్రిక్ స్టవ్ మీద పాలు కాచుకుని తాగాడు. పేపరు చదివిన పిమ్మట స్నానం. తర్వాత డైరీ రాసుకోవటం—ఒక పుట్టినరోజు సంద ర్భాన రాజు డైరీ కొనివ్వడంతో ఎనిమిదేళ్ల క్రింద మొద లయింది ఈ అలవాటు—డైరీ అయిం తర్వాత నెమ్మదిగా బయలుదేరి దారిలో హొటలులో భోజనంచేసి ఆఫీసు చేరడం —ఇదీ మామూలు.....

ఆరోజూ సాయి అలాగే ఆఫీసు చేరాడు.

చేరగానే హెడ్‌క్లర్కు సతాయింపు మొదలవుతుంది. ఓ పది రోజుల క్రిందట ఆయన సాయిని కేకేసి, ఫలానా బడికి వెళ్లి వాళ్ల మూడో అబ్బాయి జీతం కట్టి రమ్మ న్నారు. సాయి ఆపని చెయ్యనన్నాడు. అక్కడినుండి ఆ హెడ్ కర్కు ఎప్పుడు తప్పులు వెదకెడు సత్పురుషుడై కూరు చున్నాడు. ఆయన బారినుండి తప్పించుకోవడానికని సాయి, ఆఫీసు పదింటికే అయినా, తొమ్మిది ముప్పావుకే చేరేవాడు రోజూ.

ఇవాళ—

"మిస్టర్ సాయిబాబూ !" హెడ్‌క్లర్క్ పిలుపు విని లేచివెళ్లి ఆయన టేబిల్ దగ్గర నిల్చున్నాడు సాయి.

"ఏమిటే డ్రాఫ్టు ! కింది వాళ్లకు రాసే ఉత్తరాల కాపీలు పై అధికారులకు పంపరాదని చెప్పలే ? .... పైపెచ్చు ఎందుకీ చాంతాడు వాక్యాలు ?? .... నీ బియ్యే జ్ఞానమంతా ఇక్కడేమీ ఒంపక్కర్లేదు—" అని ఎడాపెడా అరిచి ఆ ఫైలుని కింద పారేశాడు.

సాయి మాట్లాడకుండా వెళ్లి తన కుర్చీలో కూర్చు న్నాడు. ప్యూన్‌ను పిలిచి క్రింద పడివున్న ఫైలును తియ్య మన్నాడు. హెడ్‌క్లర్క్ కోపానికి ధూపం వేసినట్లయింది. అయినా ఆయన ఏమీ మాట్లాడలేదు.

మధ్యాహ్నం లంచ్ ఇంటర్‌వెల్ తర్వాత ఓ గంట గడిచింది.

రవూఫ్ అన్న అక్కౌంట్సు గుమాస్తా సాయి దగ్గ రకు వచ్చాడు. అవీ ఇవీ ఏవో మాట్లాడి సాయిని పక్కకు రమ్మన్నాడు. అతి రహస్యంగా పది రూపాయలు అప్పిమ్మని కోరాడు. సాయి దగ్గర అంత లేదు. పోనీ, అయిదు చూడ మన్నాడు రవూఫ్. తన దగ్గర ఉన్నది రెండే రూపాయలనీ, దానితో యింకా మూడు రోజులు గడవాలనీ చెప్పాడు సాయి. అయితే రూపాయిస్తే నద్దుకుంటా నన్నాడు రవూఫ్. జీతం రాగానే ఇచ్చేస్తా నన్నాడు. ఇచ్చి వెళ్లి కూచుని తన పని చూసుకోసాగాడు సాయి.

హెడ్‌క్లర్క్ అతడి దగ్గరకు వచ్చాడు. ఆయన చేతిలో ఒక పొడుగాటి పట్టీ ఉంది.... "చూడు సాయిబాబూ ! ఎల్లుండి ఆదివారంనాడు మన ఆఫీసరువారి ఇంట్లో ఉప నయనం ఉంది. ఆ సందర్భంలో అబ్బాయికి ఆఫీసువాళ్లు ఒక ఉంగరం యివ్వాలని నిశ్చయించాం ! అందుకని నువ్వో రెండు రూపాయలయినా ఇవ్వాలి !" అని తేనె లొలుకుతూ పలికాడు ఆయన.

ఆ ఉపనయనం ఆహ్వానము ఏదీ తన పేరిటికి రాలేదనీ, అంచేత తను రెండు రూపాయిలు ఎందు కివ్వాలో తెలియ దనీ, అయినా తన దగ్గర ఒక్క రూపాయే ఉందనీ, గనక ఏమీ ఇవ్వలేననీ చెప్పాడు సాయిబాబు.

"ఇందాకా రవూఫ్‌కు అయిదు రూపాయ లిచ్చావే ...." అని ఎదుర్కున్నాడు హెడ్‌క్లర్కు.

సాయి చెప్పిన నిజం ఆయనకు పచ్చి అబద్ధమయింది.

సాయిబాబు మనసు వికలమయింది.

మనిషి మనిషినిలా ఎందుకు అనుమానించాలి ? ఎందుకిలా వేటాడాలి ? రోగం, దారిద్ర్యం, భూకంపం, మరణం —ఇలాటి చీకట్లు ఎన్నో ఉండగా—అవన్నీ చాలవన్నట్లు మనిషి మనిషి నెందుకు అసహ్యించుకోవాలి ..... ? తోటివారి నెందుకు ద్వేషించాలి ? హాయిగా మనసూ మనసూ విప్పి మాట్లాడుకో రెందుకు ? తన సుఖం ఇంకొకరిదిగా, ప్రక్కవాడి కష్టం తనదిగా జీవించ రెందుకు ?? అలా అందంగా ఆనందంగా జీవించడానికి కావలసింది స్నేహభావం. ఆ భావమే దైవం. అది అమృతం. అది అద్వితీయమయిన బంధం. దాని పవిత్రత, దాని నైర్మల్యం తెలుసుకుంటే, ప్రతిఒక్క వ్యక్తికీ నిజమైన మైత్రి ప్రతి ఒక్కరితో ఉంటే, ప్రపంచంలో అసలు బాధలే ఉండవేమో .... ఆ విషయంలో తనెంత అదృష్టవంతుడు—

అన్న తలపుతో ఆఫీసులోని సంఘర్షణలకు సమాధానం చెప్పుకుంటూ నడుస్తున్నాడు సాయిబాబు. అది సాయంకాలం ఆరు గంటలవేళ. అలా పార్కువైపు నడిచాడు. ఈ గుంటూరులో అదేం ఖర్మో కూచుందామంటే పార్కులో ఒక్క చదరపడుగు పచ్చిగడ్డి కనబడదు.....

—అలా బజారు వెంబడి నడుస్తున్నాడు సాయిబాబు.

ఒకచోట జనం గుమికూడి ఉన్నారు. ఎవడో అబ్బాయి డప్పు వాయిస్తున్నాడు. వాడి ప్రక్కనే యింకొకడు పేక ముక్కలతో గారడీ చేస్తున్నాడు. సాయి అక్కడ నిలుచున్నాడు. తర్వాత ఆ గారడీవాడు పాముకూ, ముంగిసకూ పోట్లాట పెట్టాడు. పాపం, ముంగిసకు ఆవేళ బొత్తిగా పని చేయాలని లేదల్లే ఉంది. కాని చేయక తప్పిందికాదు. వాటికో ట్రేడ్ యూనియనా, ఏమన్నానా ...... ? అది అయింతర్వాత ఆ గారడీవాడు తన గురుప్రసాదమయిన మంత్రం గల తాయెత్తు లను కేవలం ప్రజలమీది ప్రేమకొద్దీ అమ్ముతున్నానన్నాడు. ఆ తాయెత్తు దగ్గర ఉంటే పాము కాని, తేలు కాని, మరొకటిగానీ కరవదనీ, కరిచినా విషం ఎక్కదనీ, ఎక్కినా చావరనీ చెప్పి ఒక ఇంగువడబ్బా తెరిచాడు. దాన్నిండా లుకలుకలాడుతూ నానారకాల తేళ్లు తిరుగుతున్నాయి .... ఒక ఎర్రటి తేలుని చేత్తో తీసుకుని వాడు తాయెత్తుల అమ్మకానికి జనం చుట్టూ తిరగ నారంభించాడు. ఎవరయినా సరే ఒక తాయెత్తుని చేతిలో ఉంచుకుని ఈ తేలుతో కుట్టించుకోవచ్చుననీ ఏమీ కాదనీ హామీ ఇవ్వసాగాడు వాడు. అయినా ఎవ్వరూ ముందుకు రాలేదు. పాపం, వాడి మొహం వెలవెలబోతూంది. ఇంత కంఠశోష వృథాయేనా .... అన్పించినట్లుంది. ఆఖరికి వాడి కళ్లు ఆ గుంపులో ఉన్న సాయిబాబు మీద పడ్డాయి. అతడిని తేలుని పట్టుకోమని ఆహ్వానించాడు గారడీవాడు. కొంతమందికి సాధారణంగా తేలు కుడితే విషం ఎక్కదు. అలాటి వాళ్లలో సాయి ఒక్కడు. అతడికి ఆ విషయం తెలుసు. అయినా ముందుకొచ్చి ఆ తేలునీ తాయెత్తునీ తీసుకున్నాడు. జనం అంతా ఆశ్చర్యంగా అతడి వైపు చూశారు. తేలు కొండెం సాయి చేత్తో ఒకటి రెండు సార్లు ఆడుకుంది. సూది గ్రుచ్చినట్లుంది సాయికి. అతడేమీ ఉలకలేదు, పలకలేదు. "చూశారా ! నా తాయెత్తు మహిమ—" అని సగర్వంగా అరిచాడు గారడీవాడు. సాయి ఏమీ పలకలేదు. చాలా తాయెత్తులు అమ్ముడుపోయాయి. గారడీవాడు ఉచితంగా ఒక తాయెత్తు నివ్వబోతే వద్దని, హొటలుకు నడిచాడు సాయి. అప్పటికి చీకటవుతూంది. భోజనం ముగించాడు. దారిలో ఒక సినిమా థియేటరు కన్పించింది. ఆ సినిమా బాగుందని ఎవరో అన్నారు కానీ తాను లేక రాజా, రాజా లేక తానూ సినిమాలకు వెళ్లరే .....

3

ఇల్లు చేరాడు సాయి. దాదాపు ఎనిమిది గంట లయి ఉంటుంది. తన గది తాళం తీయబోతుండగా మహాలక్ష్మి వచ్చింది. ఆమె చేతిలో ఓ కవరుంది.

"ఇది సాయంకాలం వచ్చింది..... " అని అతడి చేతికి అందిచ్చింది చిరునవ్వుతో.

ఆ ఏటవాలు అక్షరాలు ఎవరివో చూడకుండానే చెప్పగలడు సాయి. అతడి గుండె ఆనంద తాండవం చేసింది .... ఇవాళ తాను రాజుకు రాద్దామనుకుని, ఆఫీసు గొడవలలో పడి రాయలేదు..... కాని తనకు రాజే రాశాడు ! అదేవిటోగాని తమ ఇద్దరిలో ఒకరు ఏదయినా అనుకున్న రోజున దూరంగా ఉన్న అవతలివారికీ అదే ఆలోచన వస్తుంది.... ఇలా ఇంతకుముందు చాలసార్లు జరిగాయి—ఇదంతా తమ ఇద్దరి మధ్య మాత్రమే జరుగుతుందన్న నమ్మకం కేవలం భ్రమేనా—లేక దీని వెనక ఏదయినా ఒక శక్తి అంటూ ఉన్నదా అనిపించింది సాయికి.

అప్పటికి గదిలో అడుగుపెట్టి లైట్ వేశాడు. కవరు చింపబోతూ పక్కకు తిరిగి చూస్తే మహాలక్ష్మి ఇంకా నిలబడి ఉంది. ఒక్క క్షణం ఆవిడను చూశాడు. ఆమె ముక్కుపుడకలోని వజ్రం మెరిసింది. ఆమె చూపు మెరిసింది. మాట్లాడకుండా వెళ్లిపోయింది ఆమె.

కవరులో ఇరవయి రూపాయలకు బ్యాంక్ డ్రాఫ్టు ఉంది ! ఆశ్చర్యపడ్డాడు సాయి. అదే పడవద్దని రాశాడు రాజు.

తన ఉత్తరంలో. తనకు పత్రికలోవాళ్లు ఇంక్రిమెంటు బాపతు బకాయి యాభై రూపాయలు ఇచ్చారనీ, సాయి పరాయి ఊళ్లో ఎనభై రూపాయిల జీతంతో ఇబ్బంది పడుతూంటే ఈ ఇరవయీ కాస్త సాయంగా ఉండగలవనుకుంటున్నాననీ కూడా రాజు రాశాడు.

తన చేతిలో ఉన్నది ఒక్క రూపాయి. ఇంకా గడవ్వలసినవి మూడు రోజులు. హోటలు టిక్కెట్లు రెండే ఉన్నాయి. ఎలాగా అని ఆలోచిస్తున్న తన ప్రశ్నకు మూడు వందల మైళ్ల దూరాన ఉన్న రాజు సమాధానం ఇచ్చాడు! సాయి గుండెలో వెచ్చగా ఏదో వెలిగింది.

అంతసేపూ తాను కూర్చున్న పెట్టె ఇటూ అటూ వాలడం గుర్తించి లేచాడు సాయి. కదిలించి చూస్తే పెట్టె కింద ఏదో ఉన్నట్టు తోచింది. పెట్టె జరిపి చూశాడు .... చవకబారు శృంగార గ్రంథం ఒకటి నిద్రపోతూంది!

ఇందుకనే నన్నమాట పెళ్లికాని అబ్బాయిలకు గదులు దొరకడం కష్టం.

సాయికి నరసయ్యమీద జాలివేసింది. రేపు ప్రొద్దున్నే ఇంకో గది వెతుక్కోవలసి వచ్చినందుకు సాయిమీద కూడా జాలివేసింది.

4

అస్తమిస్తున్న సూర్యుడి ఆఖరి కిరణాలు రంగు రంగుల చేతులై వ్యాపించిన ఆకాశం కింద, అలల చేతులతో అందరినీ అందుకోవాలనీ ముందుకొస్తున్న సాగరుడి చేరువగా, తమ మామూలుచోట కూర్చుని ఉత్తరాలు చదువుకుంటున్నాడు రాజశేఖరం. ప్రక్కగా సిగరెట్లు పెట్టే, దాని మిత్రుడు అగ్గిపెట్టే కూర్చున్నారు.

అతనికో పది అడుగుల దూరంలో ముగ్గు రమ్మాయిలు కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్నారు.

వెళ్లిన నాలుగు నెలలలోనూ సాయి దాదాపు ముప్పై ఉత్తరాలు రాశాడు. వాటిలో రెండో మూడో ఘనత వహించిన తపాలాశాఖవాళ్లు మింగారు. రాసిన ఉత్తరాలు అందలేదని తెలిసినప్పుడు ఏమిటో బాధగా వుంటుంది. సాయి ఎంత చక్కటి ఉత్తరాలు రాస్తాడనీ—అవీ చదువుతుంటే అతడు ప్రక్కనే ఉండి పలకరిస్తున్నట్లుంటాయి—అనుకుంటూ రాజు ఆ కట్టలోనుండి, తాను రెండు నెలల క్రిందట పంపిన ఇరవై రూపాయల డ్రాఫ్టు అందగానే సాయి రాసిన పదహారు పేజీల ఉత్తరం తీసుకుని ఇంకోసారి చదివాడు. అదంతా ఏదో సినిమాలా ఉంది..... ఆ గారడివా డెవడో తాయెత్తు లమ్మితే వాడితో కలిసి తను ప్రజలను మోసం చేశాడట. అందుకని శిక్షగా ఒకపూట భోజనం చెయ్యడం మానాడట. ఆ ఉత్తరం రాగానే చదివేసరికి, రాజుకి భలే కోపం వచ్చింది. దగ్గరుండి చీవాట్లు వేసేవాళ్లు లేకపోతేసరి! అసలే హోటలు భోజనం; అదికూడా సరిగ్గా లేకపోతే ఆరోగ్యం ఏమవుతుందనీ? తను ఆ ఉత్తరానికి ఘాటుగా జవాబు రాశాడు. అది పనిచేసిందల్లే ఉంది. ఆతర్వాత తాను హోటలు మానేసి, ఒక ముసలావిడ ఇంటో భోంచేస్తున్నానని రాశాడు. అది రాస్తూ రాస్తూ, 'నువ్వు రోజుకు ఎన్ని సిగరెట్లు కాలుస్తున్నావూ, ఇంకా పన్నెండేనా—' అని అడిగాడు సాయి. ఏం చెయ్యడం .... కబుర్లు చెప్పడానికి తాను కూడా ప్రక్కన లేకపోయెకదా—ఇంక సిగరెట్లు తాగక ఏంచేస్తానని తన ఉద్దేశం? పాపం సాయి ఉంటే కనీసం వారానికి ఏడుసార్లయినా, 'సిగరెట్లూ—లంగ్ కేన్సరూ' అన్న విషయంమీద కాలక్షేపమయిన లెక్చ రిచ్చేవాడు. ఎక్కడెక్కడికో వెళ్లి ప్రసిద్ధ వైద్యుల అభిప్రాయాలూ, కేన్సరుమీద పరిశోధనల ఫలితాలూ ఉన్న వార్తాపత్రికల కట్టింగులూ అవీ తెచ్చి ఎదుటపెట్టి మరీ అడిగేవాడు. కాని ఏమిటో తన బలహీనత—సిగరెట్టు బొత్తిగా లేకపోతే పిచ్చాసుపత్రి చేరవలసిందే—మరీ సాయి వెళ్లింతర్వాత ......

"ఏయ్ బఠాణీలూ!" అన్న గొంతుక తనవైపు హఠాత్తుగా వస్తే ఉలిక్కిపడి చూశాడు రాజు. ఆ ముగ్గురమ్మాయిలలో చెవుల రింగులమ్మాయి ఏదో కొంప లంటుకుపోయినట్లు అరుస్తూంది. ఆడదంటే ఎంత లాలిత్యముండాలి! మరీ వీళ్లిలా అయిపోతున్నారే అనిపించింది రాజుకు.

మొన్న పత్రికలో ప్రకటన ఇవ్వడానికి వచ్చిన వి. ఎస్. రావ్ నడిగితే సాయికి తప్పకుండా ఉద్యోగం యిస్తానన్నాడు. వి. ఎస్. రావ్ కంపెనీ అంటే ఎంత మంచిదనీ—! పోయిన సంవత్సరం మూడు నెలల జీతం బోనసుగా యిచ్చారట. సాయి గ్గనక అది దొరికితే—ఇద్దరూ కలిసి మళ్లీ ఈ ఇసకలో జీవితాన్ని నిండుగా జీవించవచ్చు ..... ఆ చంద్రగ్రహణం రాత్రి తలుచుకుంటే ఇప్పటికీ నవ్వొస్తుంది......

ఒకసారి ఏమయిందంటే—

మౌంట్‌రోడ్‌లో పెద్ద ఇరానీ హోటలొక్కటి కొత్తగా తెరిచారు..... ఆ తెరిచిన మరురోజు సాయంకాలం అక్కడికి వెళ్లారు. తమ ఇద్దరి జీవితాలలోనూ అల్లాటి హోటల్లోకి వెళ్లడం అదే మొదటిసారి. తెల్లటి యూనిఫారంలో అప్పుడే ఓడ దిగినవాడిలా వచ్చాడు సర్వర్. ఏం కావాలని ఇంగ్లీషులో అడిగాడు. "కేక్స్" అని తానంటే

"బిస్కెట్స్ ఆల్సో!" అన్నాడు సాయి. సరే రెండు నిమిషాల్లో వాడొక పళ్లెంలో ఒక దొంతర కేకులూ, ఓ అర వీశెడు బిస్కెట్లూ ఇంకో పళ్లెంలోనూ తెచ్చి ఉంచాడు. "కేక్స్" అని డంబంగా ఆర్డరిచ్చినప్పుడు ఇన్ని కావాలని చెప్పకపోతిమే—ఇప్పుడు వాడేమో మన వేషాల్ని చూసి ఇన్ని తెచ్చిపెట్టాడు, వీటిని వెనక్కు తీసుకు పొమ్మనడం ఎంత చులకన—అని మధనపడ్డారు తా మిద్దరూ .... ఎలాగయితేనేం అరగంట కుస్తీపట్టి—ఆ రెండు ప్లేట్లూ ఖాళీ చేసేసరికి గుడ్లల్లోకి కేకు లొచ్చాయి! బిల్లు అయిదుంబావలా మాత్రమే అయింది. ఆ తర్వాత తెలిసింది. అన్ని కేకులూ తినివుండ నక్కర్లేదని ..... ఆ సర్వర్ మేము అంతకు ముందువారం నుండి తిండిలేక మాడివుంటా రనుకున్నాడేమో—

మరోసారి—

ప్రధాన మంత్రిగారొస్తే ఆయన్ను చూడాలని కార్పొరేషన్ భవనం ఎదుట నిలబడ్డా రిద్దరూ .... జనం కిటకిటలాడి పోతున్నారు—తీరాచేసి ఆయన కారులో వచ్చేసరికి—అంతవరకూ తాము గమనించలేదు తమ చుట్టూ ఉన్న ఓ పాతికమంది నల్ల జెండాలు చూపించి ఏదో అరిచారు—అంతే! టపటప పోలీసులు చుట్టు ముట్టేసి ఆ గుంపు గుంపునంతా 'వేన్' లోకి ఎక్కించేశారు—ఆ గుంపు నట్ట నడుమ తాముండిపోయారు—! మాకేమో తెలీదు మొర్రో అంటే ఆ సబ్ఇన్స్పెక్టర్ వింటేనా—ఆ వేన్‌లో తీసుకెళ్లి తాంబరానికి ఆరుమైళ్ల తర్వాత—రోడ్డంటూ లేని ప్రదేశాన వదిలేశారు. తనకు విపరీతమయిన కోపం వచ్చింది. సాయికిదొక పెద్ద జోకు అన్పించింది. విరగబడి నవ్వాడు .... నెమ్మదిగా ఆ ఆరుమైళ్లూ నడిచి వచ్చి ఎలక్ట్రిక్ ట్రెయినెక్కి రాత్రి ఎప్పుడో గది చేరారు .... ఇదంతా పత్రిక కెక్కించి పోలీసువాళ్లని దుయ్యబడతానంటే— వద్దంటే వద్దని అడ్డం పడ్డాడు సాయి—

తమ తొమ్మిదేళ్ల పరిచయంలో అలాటి ఇంద్రధనుస్సులెన్నో ....! 1952 లో ఒక సాయంకాలం తాను చచ్చీ చెడీ రాజమండ్రిలో ఆ మెయి లెక్కకపోతే సాయి తనవాడయ్యేవాడేనా—

ఆరోజు—రాజమండ్రిలో—బండి కదలిపోతుంటే కనపడ్డ పెట్టెలోకి సూట్‌కేసుతో ఎక్కేశాడు తాను— గుమ్మం దగ్గరే నిలబడ్డాడు. ఈలోపుగా నోటినిండా తాంబూలంతో ఒక అడ్డపంచాయన వచ్చాడు. వచ్చీరాని తెలుగుతో—"ఇది రిజర్వుడు పెట్టె. దిగి పొమ్మ" న్నాడు. తనెంతో శాంతంగా జవాబిచ్చాడు. తనకు సీటు అక్కర్లేదనీ, తను అక్కడే నిల్చుంటాననీ విజయవాడలో దిగిపోతాననీ ఎంత చెప్పినా ఆ లుంగీవాడు వినడే! పైపెచ్చు వాడి బలగం నలుగు రైదుగు రొచ్చి తన్నొక పల్లెటూరి బైతులా బెదిరించసాగారు. ఈ లోపుగా గోదావరి స్టేషను వచ్చింది. వాళ్లు తన్ను దిగిపొమ్మని బలవంతం చేస్తున్నారు. ఈలోపుగా హోల్డాలుతో ఎక్కాడు ధోవతి కట్టుకున్న యువకుడు. ఎక్కి చెమట తుడుచుకుంటున్నాడు. అతడిమీదా పడ్డారు సహృదయులు. ఏమీ మాట్లాడకుండా ఒక్క క్షణం వాళ్లను చూసి తన్ను చూశాడు. తనేమీ చెప్పకుండానే పరిస్థితిని గ్రహించాడు. "మీరేం దిగనక్కర్లేదు ..... ఏమిటో వీళ్ల అజమాయిషీ నే చూస్తా—" అని హోల్డాల్‌మీద తీరికగా కూర్చున్నాడు. వాళ్లేదో బెదిరించబోయేసరికి—"ఇంకో వంద మందిని పిలిపిస్తా ఈ పెట్టెలోకి .... ఇందులో అన్ని సీట్లూ రిజర్వుకాలేదు ..... ఏమిటి మీ అక్రమం—" అన్నాడు. అంతే వాళ్లు కిక్కురు మనలేదు .... అంత ఠీవితోనూ ప్రవర్తించిన ఆ వ్యక్తి విజయవాడ వచ్చేసరికి తనకు వంద జన్మల నుండి తెలిసినవా డయాడు—

—"అదేవిటే .... చేతిలో ఉత్తరం ఎగిరిపోతుంటే అలా కళ్లు తెరుచుకునే కూచుంటాడేం—" అంది రింగులమ్మాయి.

"కవికుమారుడు కాబోలే లీలా !" అని ఘొల్లుమంది మూరెడు జడావిడ.

ఎగిరిపోతున్న ఆ ఉత్తరాన్ని నల్లచీర అమ్మాయి అందుకున్న క్షణాన్నే తన చేతిలో ఉత్తరం లేకపోవడం గమనించిన రాజు ఇటు చూసి, లేచివచ్చి ఆ అమ్మాయి చేతినుండి సాయి ఉత్తరాన్ని అందుకొని కృతజ్ఞత తెలిపి వెళ్లిపోయాడు.

ఆ అమ్మాయిలు ముగ్గురూ తమ సంభాషణ కానిచ్చారు.

5

"అదికాదు జయా! నువ్వు ఆ యిల్లు విడిచి వచ్చేయరాదూ—" అంది లీల—నల్లచీరమ్మాయిని చూసి.

"ఎలాగే లీలా—నా తర్వాత చెల్లె లొకతె ఉంది కదా—నేను వచ్చేస్తే అదేమవుతుంది ? అదీకాక నేను ఎక్కడకు వెళ్లడం ?" అని అడిగింది జయంతి—"ఎంత తాగుబోతయినా ఆయన మా నాన్న .... అది మా యిల్లు—"

"నిజమే—చేతికందిన కొడుకు పోవడం ఎవరినయినా కదిలించివేస్తుంది—" అంది మూరెడు జడమ్మాయి.

"అమ్మ పోయిన ఆరు నెలలకు అన్నయ్య పోవడం నా దురదృష్టం వసంతా!" అంది జయంతి.

లీల మళ్లీ అంది. "అవన్నీ సరే నమ్మాయ్, ఇప్పుడు ఉద్యోగంచేసి ఆ ఇల్లు నిలబెట్టుతున్నది నువ్వు .... అట్లాంటప్పుడు ఎంత తండ్రి అయినా రోజూ తిట్లూ కొట్లూ భరిస్తూ ఎంతకాలం ఈఉండడం—అనీ ?"

"రాజకుమారుడు కీలుగుర్రంమీద వచ్చేదాకా—" నవ్వుతూ అంది వసంత.

"ఏమోనమ్మా — తీరాచేసి రాజకుమారుడొచ్చి—ఊ, గుర్రంమీద కూచో, అనేసరికి మా చెల్లాయీ, మా నాన్నా అంటూ బయలుదేరదూ ఈవిడగారు—"—ఇది లీల.

"రాజకుమారుడు మంచివాడయితే వాళ్లిద్దరికీ వేరే గుర్రం ఏర్పాటు చేస్తాడులే ......"

ఇందాక ఉత్తరాన్ని గాలికి విడిచినాయన వెళ్లిపోయారు కాబోలు అంది జయంతి మనస్సు.

6

—నెమ్మదిగా నడుస్తున్నాడు రాజశేఖర్. పైక్రాఫ్ట్స్ రోడ్‌మీద ఎన్ని పాత పుస్తకాలషాపు లుంటాయనీ—అక్కడో దానిలో ఇరవై నిమిషాలు గడిచింది. 'చర్చిల్ యుద్ధ ప్రసంగాలు' కాపీ ఒకటి అరణాలకు కొన్నాడు. అది కొత్తదయితే నాలుగు రూపాయలు!

మద్రాసులో ఇదొక సౌకర్యం. మంచి పాత పుస్తకాలు చాలా చౌకగా దొరుకుతాయి. బేరమాడ్డం తెలియాలి—అంతే ....

"ఏమండోయ్ రాజశేఖరంగారూ!"

మాలతి. తన ఆఫీసులో టైపిస్టు. ఆమెను గురించి ఏదేదో అంటారు. కాని మంచిమనిషి. పక్కన ఆమె భర్త కాబోలు. "వీరు మా శ్రీవారు. పేరు శ్రీనివాస్. ఆవులకూ మేకలకూ ఇంజక్షన్లిస్తుంటారు. ఈయన రాజశేఖరంగారని మా ఆఫీసులో 'సబ్' .... మీ ఇద్దరిదీ సిగరెట్ల గోత్రం" అంది మాలతి. ఆ అమ్మాయి ఎప్పుడూ అంతే. చలాకీగా ఉంటుంది.

"ఈ ఆడవాళ్లు ఇంతేనండీ .... వేరే పనేమీ ఉండదు వీళ్లకు. వీళ్లేమో పిచ్చిపిచ్చిగా ఆ ఊలుమీదా, ఈ పూసల మీదా డబ్బు తగలెయ్యొచ్చు—మన సిగరెట్ల దగ్గర కొచ్చేసరికి యుద్ధాని కొస్తారు—" అన్నాడు శ్రీనివాస్.

రాజా నవ్వాడు. ఒక్క నిముషం అదీ ఇదీ మాట్లాడింతర్వాత ఆ దంపతులు రాజాని ఆదివారం తమ యింటికి భోజనానికి రమ్మన్నారు. వెళ్లిపోయారు.

7

హోటల్‌లో భోజనం ముగించాడు రాజా. బయటికి వచ్చి సిగరెట్ వెల్గించబోయేసరికి ఇందాక మాలతీ శ్రీనివాసుల మాటలు గుర్తుకొచ్చాయి .... సాయికీ తనకూ కూడా ఈ సిగరెట్ల విషయంలోనేగా పేచీ—సాయిని విడిచి నాలుగు నెలలయింది...... ఆ వి. ఎస్. రావుతో ఇంకోసారి ఖచ్చితంగా మాట్లాడేసి—సాయిని రాజీనామా ఇచ్చి వచ్చేయమని రాసేయాలి.

గది చేరాడు రాజా.

నాన్న రాసిన ఉత్తరం మళ్లీ చదివాడు. చెల్లెలు ఇందిర పెళ్లి విషయమే ఆరు పేజీలు రాశారు నాన్న. ఆయన అనేదేమిటంటే—'...... అతడి శాఖ వేరే అయినప్పటికీ అది మంచి సంబంధం. తెలిసినవాడు గనక కట్నం ఇవ్వక్కర్లేదు. ఈ సంబంధం గనక జారిపోతే ఇందిరకు ఇప్పట్లో పెళ్లి కాదు. కనక సాయిబాబుతో మాట్లాడి నాకు వీలయినంత త్వరగా సమాధానం రాయి—'

"ఉహు!" అనుకున్నాడు రాజా. తాను చెబితే సాయి కాదనడు. అదీకాక ఇందిర బంగారు బొమ్మలా ఉంటుంది.

తమ మైత్రి ఆధారంగా సాయిచేత — బహుశా అతని కిష్టంలేని పని చేయించడం దారుణం ..... సాయంతట సాయే, పెళ్లి చేసుకోవాలనుకుని, ఇందిర ఎవరో తెలియకుండా చూసి ఇష్టపడితే సరేకాని—తానుగా వెళ్లి సాయిని అడగడం జరగదు. ఇది అభిమానమా అని ప్రశ్నించుకున్నాడు రాజా. కాదు. సాయీ తనూ ఒక్కరే. తమ యిద్దరి మనసూ ఒక్కటే. తమ యిద్దరి మధ్య అభిమానం లేదు. రహస్యం లేదు. అందుకనే తను చూస్తూ చూస్తూ నాన్న రాసినట్టు చెయ్యలేదు. ఆ కడపలో గనక నాన్నా, అమ్మా, ఇందిరా తాను పంపించే వందతో నెట్టుకొస్తున్నారు. రిటైరయిన పంతులకు పెద్ద ఆదాయం ఏం వస్తుంది గనక—నాన్న కట్నం ఇవ్వడం కష్టం. మరయితే ఇందిరకు పెళ్లి కాదేమో .... ఏదో ఆదర్శం పేరిట తను స్వార్థమే ఆలోచించి చెల్లెలికి సాయం చెయ్యవలసిన అవకాశం వచ్చినప్పుడు తన కర్తవ్య నిర్వహణకు వెనుదీస్తున్నాడా ?—ఆదర్శం చాలా పెద్ద పదం .... అదేమిటో మరి, తనంతట తానుగా ఈ విషయంలో సాయిని ఏవిధంగానూ ప్రోత్సహించలేదు. అలా గనక చేస్తే—

ఎక్కడో ఏదో లోపం జరిగినట్లుంటుంది. ఏదో ద్రోహం చేసినట్లనిపిస్తుంది. సాయికి తనకూ మధ్య ఉన్న కనపడని విలువలలో ఒకదానిని నేలమీద పడేసి దానిమీద నడిచిపోయినట్లుంటుంది .... ఇదంతా నాన్నకు ఎలా రాయడం—

చాలాసేపు వరకు రాజుకు నిద్ర రాలేదు.

ఆ రాత్రే గుంటూరులో సాయి హెడ్‌క్లర్క్ కలలో ఒక రాజీనామా పత్రం రెపరెపలాడింది. దానికింద సంతకం ఎవరిదో సరిగా తెలియక ఆయన మధనపడ్డాడు.

8

రెండు రోజుల తర్వాత రవూఫ్ రూపాయి యివ్వకుండానే సాయి మదరాసు చేరాడు. అంతకుముందోవారంనాడే మహాలక్ష్మి గుంటూరు విడిచిన విషయం సాయికి తెలిస్తే ఆశ్చర్యపడేవాడు కాడేమో ....

పొద్దున ఎనిమిదింటికి రైలు దిగిన దాదిగా ఒక్క క్షణం విడిపోకుండా గడిపారు రాజూ సాయీ.

ఆ సాయంత్రం సముద్రం హోరుమని పొంగింది. పొంగి వాళ్లిద్దరినీ పలకరించి వెళ్లింది.

ఇలా బీచిరోడ్ వెంబడి కూడా పెద్ద పెద్ద భవనాలు కట్టేసి, నాగరికతను ఇక్కడికూ్కడా లాక్కురావడం ఏమంత బాగాలేదని చెప్పాడు సాయి. ఈలోపుగా రాజు సిగరెట్టు వెలిగించాడు. కేన్సర్ వైరస్‌మీద తా నిటీవల చదివిన వ్యాసం గురించి సాయి చెబుతుండగా ఎవరో ఒకావిడ రెండేళ్ల పాపాయిని నడిపించుకుంటూ అటుప్రక్కగా వెళ్లింది. హఠాత్తుగా ఆమె నల్లచీర చూసి రాజు గుండె లిప్తమాత్రం ఆగింది.

అబ్బే, ఆమె కాదు—

మూడు రోజుల క్రింద తను సాయి ఉత్తరాలన్నీ తెచ్చుకుని ఇక్కడ కూచుని చదువుకున్నా నన్నాడు రాజు. "చదువుకుంటూ మధ్య ఉలిక్కిపడ్డాను. లక్ష్మణుడు ముక్కు కోయగానే శూర్పణఖ అరిచిన అరుపు వినబడింది. తీరా చూస్తే ఎవరో అమ్మాయి, చాల మామూలుగా ఉంది .... ఆవిడగారు బఠాణీల కోసం అంత లలితంగా కేకేశారన్నమాట..."

రాజుతోబాటు నవ్వి సాయి చెప్పాడు .... "ఇంకా నయం .... ఏ రేసుకోర్సుకో, క్రికెట్ మేచీకో వెళ్లి చూడు .... అంతవరకూ చాలా నార్మల్‌గా ఉన్న అమ్మాయిలు ..... బాట్స్‌మెన్ బౌండరీ కొట్టేసరికి ఆరడుగుల ఎత్తు ఎగిరి, కెవ్వుమని గీ పెడతారు..... "

"కానీ దేవుడి దయవల్ల అందరు ఆడవాళ్లు అట్లా అయిపోలేదు—" అని రాజు ఆరోజు తన చేతిలో ఉత్తరం ఎగిరిపోతే ఒక నల్లచీరమ్మాయి ఎలా అందిచ్చిందీ చెప్పాడు.

"అలా పోతాయనే నీ ఉత్తరాలన్నిటినీ ఒక ఫైల్లో గుచ్చుతున్నాను" అన్నాడు సాయి.

రాజుకు నాన్న ఉత్తరం గుర్తుకొచ్చింది. ఒక్కమాటంటే చాలు......'వీల్లేదు' అనుకున్నాడు.

రాత్రి తొమ్మిదింటికి, వెన్నెల వారి దారిన చల్లిన మల్లెల మీదుగా నడిచి గది చేరారు. రాజు ఆపూట హోటలు వద్దన్నాడు. బ్రెడ్ కొనుక్కొచ్చుకున్నారు. స్టవ్‌మీద బ్రెడ్ ముక్కలు రోస్ట్ చేసుకున్నారు. అవి తిని, పాలుతాగి మళ్ళీ కబుర్లలో పడ్డారు. రాజు రిపోర్టరుగా మొన్న తా నో ప్లానింగ్ కమిటీవద్దకు వెళ్ళినప్పుడు, ఒక ఆఫీసరువారు తన పరిపాలనక్రింద వెయ్యిన్నాట పదహారు హెక్టేకర్ల మేరకు జపాను వరిసాగు చేయిస్తున్నామని చెప్పగా, తను లేచి హెక్టేకర్ అంటే ఏమిటని అడిగినప్పుడు ఆ కమిటీలోవున్న ఇరవైమందీ ఎలా మౌనవ్రతం అవలంబించిందీ వివరించాడు. గుంటూరు రైల్వేస్టేషన్ సమీపంలోని ఓవర్‌బ్రిడ్జీమీద ఇనపవూచలకు పాపాయిల బొమ్మలకు వేసినట్లు నానా రంగులూవేసి, అదో అలంకారమని అనుకున్నవారి కథ చెప్పాడు సాయి.

కథలూ, నవ్వులూ, విమర్శలూ అవుతుండగానే కోడి కూసింది. తెలతెలవారుతుండగా సముద్రాన్ని చూడాలని మిత్రులిద్దరూ లేచారు.

9

వి. ఎన్. రావుగారు ఆయన ఆఫీసు గదిలో కూచుని ఓ ఫైలు చూస్తున్నారు.

అందులోవున్న ఉత్తరం ఒక ప్రకటన విషయమై ప్రభుత్వంవారికి ఆయన ఆఫీసు రాసింది. సంతకానికి ఆయన వద్దకు వచ్చింది. ఆ ఉత్తరంలోని చేతివ్రాత అంత పరిచయమయినదిగాలేదు ఆయనకు. ఒక్కక్షణం ఆలోచించారు రావు......ఓహో—ఆ రాజశేఖరం సిఫారసు చేసిన కుర్రాడు రాసినట్లుంది. ఇతడి ఇంగ్లీషు బాగుంది—అనుకున్నా రాయన.

ఆ ఇంగ్లీషు బాగున్న అబ్బాయి రావుగారి ఆఫీసులో మొదటిజీతం పుచ్చుకుని రెండు రోజులయింది. ఆనెల రోజుల లోనే ఇతడు మిగతా పద్దెనిమిదిమంది గుమాస్తాల్లాటివాడు కాడని పసికట్టింది జయంతి.

10

ఇంకో రెండు వారాలతర్వాత ఒకరోజు మధ్యాహ్నం టిఫిన్ వేళఅయింది. కొందరు హోటళ్ళకువెళ్ళగా కొందరక్కడేవుండి,

తెచ్చుకున్న పొట్లాలు విప్పసాగారు. టిఫిన్‌రూము వెనకవైపు వరండాలో కుడి చివరనుంది. దాని కెదురుగా అవతలికొసను క్లబ్ రూమువుంది. సాయి బయటికివెళ్ళి, టిఫిన్ ముగించుకునివచ్చాడు. క్లబ్ రూములో అయిదారుగురు గుమాస్తాలు కూచుని కబుర్లాడుతున్నారు. సాయి లోపలికివెళ్ళాడు. ఉన్న నాలుగు పత్రికలూ, నలుగురు చేతులలో ఉన్నాయి. వాళ్లేమో చేతులలో వాటి నుంచుకుని, మాట్లాడుకుంటున్నారు. సాయి ఐదు నిముషాలు చూశాడు. పరిస్థితిలో మార్పేమీ రాలేదు. ఈ లోపుగా జయంతివచ్చి ఆ గది గుమ్మం ముందర నిల్చుంది. ఆమెను గమనించి కూడా గమనించనట్లు ఊరుకున్నారు ఆ పురుష పుంగవులు.

"మిష్టర్! ఆ పత్రిక నిలా ఇస్తారా?"

ఆ మిస్టర్ సాయివైపు చూశాడు.

"మేం చదువుతున్నాం. కనపడ్డంలేదూ ?"

"మీరు చదవడంలేదు. మాట్లాడుకుంటున్నారు. కనకనే పత్రిక ఇమ్మని అడుగుతున్నాం—" అన్నాడు సాయి.

"ఏం, మేము మాట్లాడుకోవడానికి తమ పర్మిషన్ కావాలా?"

"ఇవతల ఇద్దరు పత్రికలు చూద్దామని నిల్చునివుంటే మీరు వాటినలా పట్టుకుని కూర్చోవడం—"

"ఓహోహోహో—మీ విషయం మీరు మాట్లాడండి చాలు. అవతలివాళ్ళకు కావలసివస్తే, వాళ్లే అడుగుతారు—" అన్నాడు రెండో మిస్టరు. గొల్లుమన్నారు బృందం.

జయంతి అక్కడ నిలవలేదని చూడకనే తెలిసింది సాయికి.

"కలిసి ఉండవలసినవాళ్ళం మనం ఇలా వాదులాడ్డం ఏమీ బాగుండలేదు—" అన్నాడు సాయి.

"అహో! ఏమిమాట, ఏమిమాట!!"

"చేరి నెలకాలేదు, చిన్నయసూరిలా నీతులు చెబుతున్నాడు—"

"ఈయనగా రింకోరికి గార్డియన్ కూడానూ—"

సాయికి ఒళ్ళు మండింది. తమాయించుకుని అక్కడనుండి గబగబా నడిచి తన సీటుకొచ్చాడు. వస్తూ, వస్తూ అటు చూస్తే ఆమె తన వైపు చూసినట్లన్పిస్తే అటు చూడకుండా వచ్చాడు. అరఘంటదాకా సాయి ఏమీ పని చెయ్యలేకపోయాడు. ఛీ, ఈ మనుష్యులు ఎక్కడికి వెళ్ళినా ఇంతేనా......అనిపించింది. కాదు—అని అతడి మనసు ఎదుట నిలిచింది మాటలు తప్పని కృతజ్ఞత. తలెత్తి చూశాడు. ఆమె తలవంచుకుని పని చేస్తూంది.

11

ఈమధ్య రాజశేఖరం రిపోర్టరుగానే పని చేస్తున్నాడు. రెండింటికి అసెంబ్లీ రిపోర్టిచ్చేసి, సాయి ఆఫీసు కొచ్చేవాడు. ఇద్దరూ కలిసివెళ్ళి, కాఫీ తాగి వచ్చేవాళ్ళు. వర్షాకాలం అవడం మూలాన్ని టీచి మానేసి తమ గదిలోనే సాయంకాలాలు గడుపుతుండేవారు.

ఒక మధ్యాహ్నం సాయి పని చేసుకుంటుండగా రాజు వచ్చాడని బంట్రోతు చెప్పాడు. మామూలుగా సాయే వెళ్ళి విజిటర్స్ గదిలోవున్న రాజుని కలుసుకునేవాడు. అవాళ చేతిలో పని అవసరమయింది గనక, రాజునే రమ్మనమని తన ప్రక్కన కుర్చీ వేయించాడు.

ఈలోపుగా సాయి టేబిల్‌మీది ఫైళ్ళలో ఒకటి కావాలని అటొచ్చింది జయంతి.

నల్లటిచీర. నక్షత్రాల్లాటి కళ్ళు. రాజుని రెండు నెలలు వెనక్కు లాక్కెళ్ళాయి.

ఉత్తరం పారేసుకున్న పెద్ద మనిషి కాబోలు—జయంతి పెదవులమీదకు రాలేదు చిరునవ్వు. వచ్చినపని మరచి వెనక్కెళ్ళిపోయింది ఆవిడ.

తదేక దీక్షతో—వి. ఎస్. రావుగారు మెచ్చుకునే ఉత్తరం మరొక్కటి రాసి పారేసి తలెత్తాడు సాయి.

12

ఇంకో రోజు—

కొన్ని అతి ముఖ్యమయిన ఉత్తరాలకు జవాబులు రాయాలని సాయి చాల త్వరగా ఆఫీసు కొచ్చాడు. గంట తొమ్మిదయిఉంటుందేమో! ఇంకా ఎవ్వరూ రాలేదు. వాచ్‌మన్‌ని కేకేసి టేబిల్ తుడిపించి, పనిలో కూచున్నాడు సాయి. ఒక ఉత్తరం ముగించాడో, లేదో జయంతి రిక్షా దిగి, లోపలికి వచ్చింది. ఆమె మొహం చూస్తే స్నానం చేసినట్లు కనపడలేదు. ఆమె తిన్నగా అతడి దగ్గరకు వచ్చింది. ఆమె పెదవులు వణకుతున్నాయి. ఆమె అంది—

"మా నాన్నకు పొద్దుటినుంచీ చాలా సీరియస్‌గావుంది. డాక్టర్‌కోసంవెళ్తుంటే దారిలో ఆఫీసులో ఎవరన్నావుంటే సెలవు పెడుతున్నానని చెబుదామని వచ్చాను."

"ఇంటో నాన్నగారిదగ్గర ఎవరున్నారు?" అని అడిగాడు సాయి.

"చెల్లాయి రాణివుంది. అది ఒకటే ఏడుపు—"

"మీ ఇంటి అడ్రసు నా కివ్వండి......మీరు తిన్నగా ఇంటికి వెళ్ళి నాన్నగారిని చూచుకోండి......పది నిముషాలలో నేను డాక్టరు గారితో వస్తాను" అని సాయి, అడ్రసు తీసుకుని, టాక్సీమీద.

అరమైలు దూరానవున్న తమ గదికి డబ్బుకోసం వెళ్ళాడు. ఆపూట 'ఆఫ్' అవడం మూలాన్న తిరిగ్గా కూర్చుని సిగరెట్లు కాల్చు కుంటున్నాడు రాజా. సంగతివిని గాభరాగా బట్టలు తొడుక్కుని ఇద్దరూ కలిసి, వెళ్ళి డాక్టర్ మూర్తిని తీసుకుని జయంతి వాళ్ళ ఇల్లు చేరారు.

తండ్రిని డాక్టర్ పరీక్ష చేసినంతసేపూ జయంతి చావు బతుకులమధ్య ఊగిసలాడింది. ఛే.......తానే గనక డాక్టరయి వుంటే ఏమయినాచేసి, ఆ అమ్మాయి తండ్రిని కాపాడుదునే అనుకున్నాడు రాజా. సాయి మూర్తి ప్రతికదలికనూ వెయ్యికళ్ళతో చూశాడు.

డాక్టర్ చెప్పాడు. "త్రాగుడు ఎక్కువయి, అది విషంగా పరిణమించింది. గుండె పూర్తిగా దెబ్బతింది. ఇప్పుడో ఇంజక్షనిస్తాను. ఇంకోటి సాయంకాలం. అలాగే రేపు రెండు. ఎల్లుండి క్కాని ఏమీ చెప్పలేను."

జయంతి లోపలి గదిలోకి పోయింది. డాక్టరుకు డబ్బిచ్చి టాక్సీలో పంపాడు రాజా. రాణిని దగ్గరకు తీసుకుని ఓదార్చాడు సాయి.

అరఘంటతర్వాత హోటలునుండి కేరియర్‌తో అన్నం తెప్పించాడు రాజా. జయంతి వద్దంటే కోప్పడ్డాడు. రాణికి దగ్గరుండి అన్నం పెట్టాడు సాయి.

సాయంకాలం డాక్టర్ మూర్తివచ్చి రెండో ఇంజక్షనిచ్చాడు. రోగి పరిస్థితి పొద్దుటికన్న మెరుగేకాని, ఇంకా సందేహమే నన్నాడు.

13

ఇది జరిగిన పదిరోజుల తర్వాత—

ఒక మధ్యాహ్నం ఆఫీసులో కూచుని పని చేసుకుంటూం డగా సాయికో కవరొచ్చింది. చింపిచూశాడు. అతడి గుండె భగ్గుమన్నది.

సాయి జయంతుల ప్రణయకలాపమంతా తనకు తెలుసుననీ, ఒకరోజు పొద్దున్నే ఆఫీసు దగ్గరకొచ్చి, కలిసి, సెలవు పెట్టి మహాబలిపురం వెళ్ళినకథ చాల రమణీయమైనదనీ రాసిన ఆ లేఖకుడు, పిల్లి కళ్ళు మూసుకుని పాలుతాగిన కథతో ముగించాడు.

సాయిబాబులోని ప్రతీ అణువూ పళ్ళు కొరికింది. అతడిలో పదివేల పిడుగులు పడ్డంత చప్పుడయింది. వెలుతురు, చీకటినమ్మెటిలై పొడిచింది. తలెత్తిచూచాడు. పంకాలు ప్రశాంతంగా తిరుగుతున్నాయి. వాటిక్రింద గుమాస్తాలు— కాదు రాక్షసులు ఏవో ఉత్తరాలు రాసుకుంటున్నారు. ఇంకా ఎందరి గుండెల చిచ్చుపెట్టడానికో—సాయి అక్కడ కూర్చోలేక పోయాడు. తిన్నగా లేచి నడుచుకుంటూ సముద్రతీరం చేరుకున్నాడు. దాదాపు నాలుగు మైళ్ళు నడిచినట్లు అతడికి తెలియదు. అలల హోరు అతడిని కొంత శాంతపరిచింది. కుర్రవాళ్లెవరో బట్టలతోనే స్నానాలు చేస్తున్నారు. నీళ్ళు చల్లుకుంటూ కేరింతలు కొడుతున్నారు. సాయి వాళ్ళను చూస్తూ నిల్చున్నాడు. దూరాన, ఆకాశమూ అర్ణవమూ చేతులు కలిపిన నీలిరంగు అంచుమీద, వికారంగా నల్లగీత కనబడితే, ఉలిక్కిపడి చూశాడు. పెద్ద పొగ ఓడ ఒకటి హార్బర్‌లోకి వస్తూంది.

అప్పుడింకా మూడవలేదు.

ఉన్నట్లుండి ఆకాశం మబ్బుల దుప్పటి కప్పుకుంది. భోరుమని వర్షం మొదలయింది. బరువుగా నెత్తిమీద వర్షం పడుతుంటే జోలపాటలావుంది అతడి మెదడుకు. కొంతదూరం అలాగే నడవగా, ఒక రిక్షావాడు ఎదురయి, రిక్షా కావాలా అని అడిగితే అడ్రసు చెప్పి ఎక్కి కూర్చున్నాడు. గది చేరుకున్నాడు. బట్టలు మార్చుకున్నాడు. వి. ఎన్. రావుగారిపేరిట, ఆయన ఆట్టే మెచ్చుకోని ఉత్తరం ఒకటి రాశాడు.

అయిదింటికి రాజు వచ్చాడు. ఒక మూల పడేసివున్న తడిబట్టల్ను చూశాడు. సాయిని చూశాడు. అతడితల తడిగా ఉండడం గమనించాడు. తువ్వాలు తెచ్చి అతడి తల తుడిచాడు.

రాజు ఏమీ అడగలేదు. సాయే అన్నాడు: "ఆఫీసు నుండి వచ్చేశాను. దారిలో తడిశాను—". అని పడుకున్నాడు. రాజు ఒక ముఖ్యమయిన మీటింగ్‌వుంటే రిపోర్టింగ్‌కని వెళ్ళిపోయాడు.

దారిలో భోజనం ముగించుకుని, రాత్రి తొమ్మిదింటికి గదికి వచ్చాడు. సాయి అలాగే పడుకునివుంటే లేపి బలవంతాన లాక్కువెళ్ళి ఇంత అన్నం తినిపించాడు.

మరుసటిరోజు పొద్దున కాఫీ తాగుతుండగా సాయి నవ్వాడు. "రాజా! నిన్నటి విషయమంతా నీకు తర్వాత చెబుతానులే"—అన్నాడు.

రాజా నవ్వాడు. నవ్వి, అవీ, ఇవీ మాట్లాడి, "జయంతి వాళ్ళనాన్నకు పూర్తిగా నయమయినట్లేనోయ్.....నిన్న మధ్యాహ్నం వాళ్ళింటికి వెళ్ళివచ్చాను. ఇకమీదట ఆయన ఏమీ త్రాగనని డాక్టర్ మూర్తికి వాగ్దానం ఇచ్చాడు......బిల్లును నాకు పంపమని మూర్తితో చెప్పివచ్చాను—"

కాఫీ తాగుతున్నవాడల్లా ఆగి, రాజు మొహం చూశాడు సాయి.

రాజులో నిండు సముద్రంలా ఏదో ఉత్సాహం తొణికిసలాడుతూంది.

“అవును సాయీ.... బిల్లునాకే పంపమన్నాను”. అని సాయికళ్లలోకిచూస్తూ— “సాయీ! నేను జయంతిని భార్యగా స్వీకరించనిశ్చయించాను..... నీ సాయంకావాలి” అన్నాడు రాజా.

అరగ్లాసుకాఫీని ఒక్కసారిగాతాగి గ్లాసుని క్రింద పెట్టాడు సాయి. “రాజా! నువ్వొక్క ఇంటివాడి వవుతావంటే నే నేమయినా చెయ్యగలను.... చెప్పు—”

సాయిచేతులను తనచేతుల్లోకి తీసుకున్నరాజు కనుల కొనల నీరునిండింది.

14

ఆఫీసులో వి. ఎస్. రావుగారు యథాప్రకారం తమ గదిలోకూచుని పనిచూచుకుంటున్నారు. తమసంతకానికని వుంచిన ఒకఇంగ్లీషుఉత్తరం చదివారు. దానిలోఒకేవాక్యంలో ‘చిల్డ్రన్స్’ అనీ, ‘కేచ్‌డ్’ అనీవున్నాయి. ఆయనకు విపరీత మయిన చిరాకొచ్చింది.

“ఛీ! ఛీ! ఛీ! ఇలాటి యంత్రబ్రహ్మలందరూ తిష్ట వేసుక్కూచుంటారు. చక్కగా ఇంగ్లీషురాసే సాయిబాబులాటి వాళ్లేమో రాజీనామాపారేసి పోతారు. ఆ అమ్మాయికూడా బాగానేరాసేది. వాళ్ళనాన్నకు జబ్బుని నెలరోజులు సెలవు పెట్టింది.... ఇంకనాకు మిగిలింది ఈ పుంభావ సరస్వతులు..... ఏం ఖర్మరా దేవుడా!” అనుకుని ఆ లేఖారాజాన్ని రాసిన సరస్వతిని కేకేశారు రావుగారు.

15

“నాలుగురోజులలో రాజా గృహస్థు అవుతున్నాడు. ఎంతో సంతోషకరమయిన వార్త. ఈ సందర్భంలో నేనువెళ్ళి జయంతి నాన్నతోమాట్లాడి ఆయన్ను ఈపెళ్ళికి ఒప్పించగలిగాను. కులంకాని కులమని ఆయనఎంత పట్టుపట్టాడనీ! .... నారాజా.. హు! ఇకనుండి అతడిని అలా పిలవగల్గిన హక్కుఅతడిజీవిత భాగస్వామినిది అవుతుంది. ఆమాటఅనుకుంటే ఎందుకోఏడుపు వస్తూంది.... కాని ఒకయువకుడు పెళ్ళిచేసుకోవడంఅన్నది చాలాసాధారణమయిన విషయం. మామూలుగా అతడిమిత్రు లందరూ సంతసించవలసిన విషయం. మరి నే నెందుకిలా క్రుంగి పోతున్నాను? రాజు మారిపోతాడనా? మారడు.... అతడు అప రంజి. ఆమె అమృతమూర్తి. వాళ్ళిద్దరి జీవితాలూ పారిజాతమ్మై పరిమళించాలి; పన్నీటిజల్లై చల్లగా సాగాలి. ఇది కోరుతున్న నాహృదయంలో చీకటిరేఖలాటి అసూయఎవరిమీద.... నెల క్రింద అతడిజీవితంలోకి ప్రవేశించిన ఒకయువతి రాజుని చేసుకుంటూందనా? భగవాన్.... మమ్మల్నిద్దరినీ ఎందుకు కలిపావు.... అంతఎత్తులకు వెళ్ళిందల్లా ఇలా భూమ్మీదకు రాలడానికేనా— .... ఏవిటిది .... పిల్లవాడిలా”— అనిరాసు కున్నాడు డైరీలో

అదే డైరీలో ఇంకోఅయిదురోజుల తర్వాతపేజీ—

“నిన్న రాజా జయంతుల జీవితాలు ఒక్కటయ్యాయి. క్షణం తీరికలేదు. డైరీ కూడా రాయలేకపోయాను....మహూర్తం అయింతర్వాత రాజాని పక్కగా గదిలోకి పిలిచి, నా చిన్న బహుమతి టేబిల్ ఫాన్‌ని చూపించి స్వీకరించమన్నాను. అతడు నన్ను కౌగ లించుకున్నాడు......నా కళ్ళు తుడిచాడు. రాజా ఎప్పటి రాజే! మారిపోడు......రాత్రి భోజనాలవద్ద నేను వడ్డన తీసుకున్నాను. రాజు కొక్కటే, జయంతి కొక్కటే లడ్డూలు వేశాను. “అన్న య్యా! ఇదేం అన్యాయం! ఆయనకు ఇంకో నాలుగు వేయిం చు—” అంది జయంతి. ఆమె అనురాగం హిమాలయంలా వుంది.

ఇంకొక్క రెండు నెలల తర్వాత

—“కొత్త ఉద్యోగం బాగానే ఉంటూంది. రాజా వేరే కాపురం పెట్టిం దగ్గర్నుండీ గది బావురుమంటూంది.....వేరే గదిలోకి మారిపోతే—?రాజువచ్చి వాళ్ళింటో ఉండమంటాడు. ఎలా ఉండను?......కొన్నాళ్ళు ఎటయినా తిరిగివస్తే బాగుం డును—”

—అటుపిమ్మట నలభై రెండవ పేజీ.

“డైరీరాసి పదిరోజులయింది. ఎందుకో అర్థంకాని బద్ధకం వచ్చేస్తూంది......ఈ సోమరితనం మనసుదా, శరీరందా? ఏమో మరి—“డాక్టరు దగ్గరకు వెళదాం రమ్మంటాడు” రాజు. “మా ఇంట్లో ఉండండి అన్నయ్యా” అంటుంది జయంతి. ఎంత మంచితనం......! అయినా నిన్న రాజు అలా ఎందుకు చేశాడు? సాయంకాలం ఆరింటికి హైకోర్టుదగ్గర కలుసు కుందామన్నాడు రాజు. అయిదూ నలభైకి నేను అక్కడ ఉన్నాను. తానూ ఆరూ పది కొచ్చాడు. చాలారోజులతర్వాత ఇద్దరమూ కలిసి బీచికి వెళ్దామని మనసెంతో ఆహ్లాదంగావుంది. ఇద్దరం ‘అన్నపూర్ణ’ లోకి వెళ్లాం. టీ తాగుతుంటే రాజా చెప్పాడు. జయంతి చక్కటి టీ తయారు చేస్తూందట. బయటికివచ్చి, బీచివైపు తిరిగిన నన్ను చెయ్యి పట్టి ఆపాడు రాజు. “సాయీ! నన్ను క్షమించు— ఆఫీసుకు జయంతి ఫోన్ చేసింది. తిన్నగా ఇంటికి రమ్మంది. నీతో చెప్పానుకదా అని ఇలా వచ్చాను. మనం బీచికి ఇంకోరోజు వెళదాం. అర్థం చేసుకుంటావుకదూ—” అన్నాడు.

“అలాగేనోయ్—” అని నేనన్న అయిదో నిముషానికి రాజాని తీసుకుని వెళ్ళిపోయిం దొక రిక్షా......రాత్రెల్లా నిద్రలేదు...... రాజా! ఎలాచెప్పను........ఏమని చెప్పను......”

—మళ్ళీ ఎనిమిదిరోజుల తర్వాత ఆదివారంనాడు డైరీ తీసుకున్నాడు సాయి.

“పొద్దున్న రాజా వాళ్ళింటికి భోజనానికి వెళ్ళాను. వా ళ్ళాఫీసు టైపిస్టు మాలతిట. ఆమే, ఆమె భర్త శ్రీనివాసూ వచ్చారు. అందరం కలిసి భోజనం చేశాం. అదేదో పాలపిండి మిరియంట. జయంతి చేసింది. చాలా రుచిగావుంది. సరదా గానే గడిచింది. అయినా, వాళ్ళు నలుగురిలోకి ఒక్కోసారి కలిసి పోలేక పోయానేమో అన్పించింది. తీరా భోజనా లయాక శ్రీనివాస్ సిగరెట్టు వెల్గిస్తూ, రాజు చేతికి పేకెట్ నిచ్చాడు. “వద్దండీ, నేను కాల్చడం మానేసి రెండు వారాలయింది” అన్నాడు

రాజు ఎంతో తాపీగా. నేను ఓడినచోట—నాలుగు నెలల్లో—విజయం సాధించిందన్నమాట జయంతి! ఎలాగయితేనేం రాజుని సిగరెట్ల పీడ వదిలింది—అదే పదివేలు".

మళ్ళీ సోమవారం రోజు—

"......ఈ తలనొప్పి ఉండుండి వచ్చేస్తూంది. కొన్ని గంటలసేపు ప్రాణాలు తోడేస్తూంది. డాక్టర్ ఎక్స్‌రే కూడా తీసిచూశాడు......ఏమీ లేదంటాడు......అమ్మకు నన్ను చూడాలని ఉందిట......పాపం అమ్మ......ఏదో నెల కింత పంపడం మినహా ఆమెకు నేనేం చేశాను......"ఎన్నో నాళ్ళుండను......ఇక్కడికి రా" అని రాసింది అమ్మ—నెల్లూరు వెళ్ళాలి".

16

"జయా! సాయి వాళ్ళమ్మ మొన్న గురువారంనాడు పోయిందట. సాయి రాశాడు. తాను వెళ్ళేసరికే చాలా నీరసంగా ఉందట. ఒక్కరోజు జ్వరం వచ్చిందిట. మర్రోజు పొద్దున లేచి అదీ, ఇదీ మాట్లాడి పడుకుందిట. మళ్ళీ లేవలేదట."

"ఎంత కష్టమండీ అన్నయ్యకూ......అసలే ఈమధ్య ఏవిటోగా అయిపోయాడూ......"

"నిజం జయా! సాయి మనుపటిలా లేడు. ఈసారి సాయి వస్తే, బలవంతాన్నైనా మనింటో ఉంచుకోవాలి......"

"నిజమేనండీ—ఆయన ఆరోగ్యం బాగుపడగానే చక్కటి అమ్మాయిని చూసి పెళ్ళిచేయాలి—"

"తమ రా పెళ్ళిలో పెత్తందార్లై వెలిగిపోతారన్న మాట—".

జయంతి నవ్వింది.

"మరి జయా! ఈ లోపుగా మన అమ్మడు కూడా వచ్చేస్తే, అమ్మా, కూతురూ కలిసి బోలెడు సందడి చేస్తారన్నమాట"—

—వారం గడిచింది. పదివారాలు గడిచాయి. సాయి రాలేదు. అతడినుండి ఉత్తరమూ రాలేదు.

ఏమిటి......ఏమి జరిగింది......వారానికి రెం డుత్తరాలు రాసేవా డివే ఎందుకు రాయలేదు.....ఆరోగ్యం బాగుండలేదా..... రాజు ఉండలేకపోయాడు.

ఒకవారం సెలవుపెట్టి నెల్లూరువెళ్ళి వాకబు చేశాడు. వాళ్ళమ్మ పోయినతర్వాత మూడు వారాలు నెల్లూళ్ళోవున్నాడట సాయి—తర్వాత, ఉన్న చిన్న ఇంటిని అమ్మేసి వెళ్ళాట్ట...... రాజు కంతా అయోమయంగావుంది. అక్కడనుండి గుంటూరు వెళ్ళాడు. మదరాసు వెళ్ళింతర్వాత ఆయన్ను చూడలేదని చెప్పాడు ఒకతను. అతనిపేరు రవూఫ్‌ట. సాయి ఎక్కడికి వెళ్ళాడు. ఏం చేస్తున్నాడు—రాజు గుంటూరునుండి విజయవాడకు వెళ్ళాడు.

అక్కడ వి. ఎస్. రావు కంపెనీ ఏజెంటు సుందరావని ఒకాయన కన్పించాడు. "......సాయిబాబంటే—సన్నగా పొడుగ్గా కాస్త నెరిసిన జుత్తుతో ఉండేవాడు. ఆయనేనా—మా కంపెనీలో కొంతకాలం పనిచేశాడు కదండీ......అయితే చూశాను—"

"ఎక్కడ? ఎక్కడ?"

"హిహి......నే నీ మధ్య కొన్ని పెళ్ళి పరీక్షలకు వెళ్ళి వస్తున్నాలెండి—పోయిన్నెల గుంటూరు వెళ్ళాను. తిరిగి వస్తుంటే మంగళగిరి స్టేషనులో సాయిబాబులాటి ఆయన బండిదిగి పోతున్నాడు. ఎక్కడో చూచినట్లుందే అని గుర్తుకు తెచ్చుకుని, పిలవబోయేసరికి బండీ కదిలింది. అయినా వెళ్ళిపోయాడు."

"ఓ" రాజు మనసులోని ఆశ మునిగింది.

"అన్నట్టు మీరు మంగళగిరి వెడతారేమోకదూ—నేనూ మీతో బాటే వస్తా. నేను కడప దాకా వెళ్తున్నా...... కడపలో చంద్రశేఖరంగారని ఒక రిటైర్డ్ టీచరున్నారు. వాళ్ళ అమ్మాయిని చూడ్డానికి—"

"చంద్రశేఖరమా? మీరు చూడబోయే అమ్మాయి పేరు ఇందిరేనా?"

"ఆ! మీకు తెలుసేవిటి వాళ్ళు—"

"అవును"......ఇతడు జీవితంలో భాగస్వామినిని వెదుక్కుంటూ తన చెల్లిల్ని చూడడానికి వెళ్తున్నాడు. తనేమో తన ప్రాణాన్ని వెతుక్కుంటూ తిరుగుతున్నాడు. జీవితం ఏదో పెద్ద దాగుడుమూతలాటలా అన్పించింది రాజుకు. మంగళగిరి కూడా నెల్లూరులాగే, గుంటూరులాగే జవాబు చెప్పింది. పిచ్చెత్తినట్లయింది.

సాయీ—ఎందుకు నాకీ శిక్ష—ఎప్పుడొస్తావు నా దగ్గరకు......ఎక్కడున్నావు......పొద్దు పొడిస్తే ఒకరి నొకరు చూడకుండా ఉండలేమే—ఇన్ని నెలలు ఎలా ఉండగలిగావు? ఆఖరికి ఉత్తరమన్నా లేదే. ఎందుకు? ఎందుకు?

చిక్కి సగమై ఇల్లు చేరాడు రాజు. రోజొక్కయుగంగా మూడు నెలలు గడిచాయి......జయంతిని చూచుకుని ఎంతో సంబాళించుకుని ఉండ ప్రయత్నించాడు రాజు. అయినా అతడిలోని నీడ ఆమెకు తెలియకపోలేదు.

సాయి గదికి అద్దె కడుతూన్నాడు రాజు.

17

రాజు ఆఫీసుకు వెళ్తూ వస్తూ ఉన్నాడు. ఒక సాయంకాలం అతడింటికి వచ్చేసరికి జయంతి వంటగదిలోవుంది. ఏదో పాడుకుంటూఉంది......పడక కుర్చీలో కూలబడ్డాడు రాజు. అప్రయత్నంగా అతడి కళ్ళు కేలెండరుమీద పడ్డాయి. ఇవాళ్టికి ఆరునెలలయి తొమ్మిది రోజులయింది. ఇంకా ఎన్ని రోజులు సాయి తనకు దూరంగా ఉంటాడు??

'గడియ యేనియు ఇక విడిచిపోకుమా—

ఎగసిన హృదయము పగుల నీకుమా—' జయంతి సన్నగా పాడుకూంటూంది. రాజు కళ్ళు మూసుకున్నాడు. సాయి, తను అడగ్గా, ఆ సముద్రతీరాన ఎన్ని వందల

సార్లు పాడాడా గొప్పపాటను—ఆ పాట చివర 'ఎన్నినాళ్ళకీ బ్రతుకు పండెను—ఎంత హాయి ఈ రేయి నిండెనో—' అన్న పంక్తులు పాడేటప్పుడు సాయి కళ్ళు మూసుకునేవాడు!

అటొచ్చిన జయంతి రాజుని చూసి—ఆశ్చర్యపోయింది. అలికిడివిని కండ్లు తెరిచాడు రాజు......మాట్లాడకుండా ఆమె ఒక ఉత్తరంతెచ్చి ఇచ్చింది.......అది వి. ఎన్. రావుగారు రాసిన ఉత్తరం. తను ఆఫీసులో కొన్ని ఖాళీలు ఏర్పడ్డాయనీ, సాయి బాబు ఇష్టపడితే అతడిని వాటిలో ఒకదానికి తీసుకోదలి చామనీ రాశారు ఆయన.

నిట్టూర్చాడు రాజు. జయంతి ఇచ్చిన కాఫీ తాగాడు. "అన్నయ్య వస్తారండీ" అంది ఆమె......రాజు నవ్వాడు. జయంతి రాజు సంతోషానికోసం తాను చేయగలిగిందెల్లా చేస్తోంది. అయినా, అతడి ఆవేదన తీర్చడం తన చెయ్యలేని పని అని ఆమెకు తెలియక కాదు. తా నొక తల్లియైననాడు రాజు పాపనుచూసి కొంత బాధ మరిచి పోగలడని ఆశించింది ఆమె. ఏనాటికయినా నా అన్నయ్య వెనక్కొస్తాడని......అన్నయ్య, ఆయన పాపాయీ ఆడుకుంటుంటే తను చూడగలనన్న నమ్మకాన్ని వెలిగించుకుంది జయంతి.

—ఆరోజు పొద్దున్నే రాజు లేచి ఇవాల్టికి ఆరున్నరనెలలు అయిపోతుంది అనుకున్నాడు.

18

అదేరోజు రాత్రి కడపలో ఇందిరఅన్న అమ్మాయి పడు కుని నిద్రరాక ఇటూ అటూ పొర్లుతూంది. అవతలిగదిలో వాళ్ళమ్మా, నాన్నా పెళ్ళి సంబంధాల గురించి మాట్లాడు కుంటున్నారు.

'ఏమిటో......అమ్మా నాన్నలకు బరువుగా ఎంతకాలం ఇలా ఉండడమో— ఎవరో ఒకాయన వారం ముందు విజయ వాడనుండి వచ్చి వెళ్ళారు. సుందరరావుట.......అంతా అయి పోయిందనుకున్నారు......తీరా చూస్తే వాళ్ళ కుటుంబంలో చాలమందికి క్షయట......ఏదో ఒకటి పెళ్ళంటూ అయి, నేను వెళ్ళిపోతే అమ్మా, నాన్నా హాయిగా రాజన్నయ్య దగ్గరవుండి పోతారు. అసలు అందరినీ వచ్చెయ్యమని జయంతి వదిన చాలసార్లు రాసింది. నేనైనా ఓసారి మద్రాసు వెళ్ళాలి...... ఒదినకు బలే వంటలొచ్చుట.......అన్నీ నేర్చేసుకోవాలి......" అనుకుంటున్న ఇందిర ఆలోచనల కడ్డంగా వాళ్ళ నాన్న స్వరం వినపడింది.

"ఇదిగో......నిన్న ఆ మదనపల్లివాళ్ళకు అమ్మాయి జాతకం పంపానా—వాళ్ళు గనక సరిపోయిందని వ్రాస్తే నేనే మదనపల్లి వెళ్ళి, అన్ని వివరాలూ కనుక్కొనివస్తా—ఆ తర్వాత అమ్మాయిని చూడ్డానికి రమ్మంటా......" అన్నారాయన.

"ఇంకా ఎన్నాళ్ళో ఈ పరీక్షలు"—అంది ఇందిర తల్లి.

"ఏం చేస్తాం......నీ కొడుకు ప్రబుద్ధుడు.......ఆ చక్కటి సంబంధంవుంటే చేతులారా విడిచిపెట్టాడు. పై పెచ్చు ఏదో అర్థంకాని చెత్తంతా రాస్తాడు—"

రాజఅన్నయ్య ఎంతో మంచివాడు—అనుకుంది ఇందిర.

19

ఆమె అలా అనుకున్న తర్వాత పదోరోజున రాజు ముందు గదిలో పేపరు చదువుకుంటుండగా, జయంతి పిలిచింది. పరుగెత్తి వెళ్ళాడు. ఆమె రొప్పుతూ, కళ్ళు మూసుకుంటూ, పళ్ళు కొరుకుతూవుంది.

రాజుకేమీ తోచలేదు.....మంచినీళ్ళిమ్మంది జయంతి. ఇచ్చాడు రాజు. లేడీ డాక్టరును పిలుచుకురమ్మంది. ఆపని చేశాడు.

లేడీ డాక్టర్ జయంతిని చూచింది. సాయంకాలం ఆరిం టికి రాజు తండ్రి కాగల సూచన లున్నాయనీ, జయంతి ఆరోగ్యం దివ్యంగా ఉందనీ, ఏమీ గాభరా పడనక్కరలేదనీ హామీ ఇచ్చి వెళ్ళింది.

జయంతి పడకమీదే వుంది. హోటలు కేరియర్ తెప్పిం చాడు రాజు. భోజనం అయింతర్వాత కుర్చీలో కూర్చున్నాడు. పూర్వం అయితే భోజనంకాగానే సిగరెట్టు కావలసివచ్చేది...... ఇప్పుడా బాధలేదు.....హఠాత్తుగా గుండె కెలికినట్లయింది. సాయి ఎన్నిసార్లు చెప్పాడు సిగరెట్లు మానమని.....తను మాన లేదు. కాని, కాని........సాయీ.........

20

"పోస్ట్!"

అదిరిపడి వెళ్ళి అందుకున్నాడు రాజు. నాన్న రాశారు. మదనపల్లినుండి వారంకింద కడప వచ్చారట—ఆ సంబంధం కుదరడం ఖాయమట—ఇంకో రెండు నెలలలో ఇందిర పెళ్ళిట.

హమ్మయ్య అనుకున్నాడు రాజు.

కాని, ఆఖరి పేరాకు వచ్చేసరికి అతడి కళ్ళు చెదరి పోయాయి—ఏమిటది?

మదనపల్లిలో నాన్నవెళ్ళిన ఆ వరుడి ఇంటో— ఏదో మద్రాసు ఊసు వచ్చేసరికి, వాళ్ళన్నారట. మొన్న మొన్నటి దాక వాళ్ళెదురింటో లక్ష్మమ్మ అని ఒకావిడ ఉండేదని, వాళ్ళతోబాటు సాయిబాబు అనే అతడుండేవాడని, రెండువారాల క్రిందే లక్ష్మమ్మ చిత్తూరు దగ్గర పల్లెపట్టు అనే గ్రామానికి వెళ్ళిందనీ—అక్కడివాళ్ళు చెప్పినట్టు నాన్న రాశారు!

ఏమిటి ఈ ఘోరం! నాన్న ఇలా నెమ్మదిగా ఉత్తరం రాయడమేమిటి—సాయిపేరు వినగానే తన కాయువ ఒక పెరిగ్రాం ఇచ్చివుంటే తానుపోయి తన సాయిదగ్గర మరుక్షణం వాలునే— హూ......నాన్న నని ఏం లాభం ...... సాయి ఎక్కడికో వెళ్ళి పోయినట్లు నాన్నకు తాను రాయలేదు. రాసినా వాళ్ళకు అర్థం కాదు.......

ఎలాగయితేనేం సాయి దొరికాడు.....ఇంకోక్షణం వృధా చెయ్యడానికి వీలులేదు.....కాని, కాని, జయంతిని విడిచి ఎలా వెళ్ళడం.........జయంతి నాన్నా, చెల్లెలూ కూడా సమయానికి తగ్గట్టు ఊళ్ళోలేరే—జయంతి తొలి ప్రసవం.....క్షణం ఆల సించకుండా సాయిని కలుసుకోవాలి.....

రాజు నాన్న ఉత్తరాన్ని తీసుకువెళ్ళి జయంతి చేతి కిచ్చాడు. ఆమె చదివింది.

"తక్షణం బయలుదేరి వెళ్ళండి......వెళ్ళి అన్నయ్యను ఇక్కడికి తీసుకొచ్చేయండి......"

"మరి నువ్వో—"

"నాకేమీ ఫరవాలేదని డాక్టర్ చెప్పిందిగా......మన పాపాయీ, అన్నయ్యా ఒక్కసారే వస్తారు కాబోలు. వెళ్ళండి..... ఆయన్ను తీసుకురండి—"

రాజు మాలతిని ఫోన్‌మీద పిలిచాడు. ఆమెనూ, ఆమె భర్తనూ తమ ఇంటికివచ్చి రెండురోజులుండమని పరిస్థితి వివరించాడు.

వెటర్నరీ డైరెక్టరు కార్యాలయం ఫోన్ అరఘంటదాకా ఆ నగరంలో ఇంకెవరికీ లభించలేదు. అంతసేపూ మాలతి ఆమె భర్తతో మాట్లాడిందన్నమాట.

21

మూడు గంటలకు ఇల్లు విడిచాడు రాజు. నగరి వెళ్తున్న బస్సెక్కాడు. ముప్పై మైళ్ళువెళ్ళి, ఆ బస్సు ఆగిపోయింది. ఇంజన్ పాడయిందని గంటసేపు రిపేరు చేశాడు డ్రైవరు. 'దేవుడా! మనుషులకు రెక్కలివ్వకపోతివే—' అని తపించింది రాజు హృదయం. ఎట్టకేలకు కండక్టరు ప్రక్కవూరికి నడిచి, అక్కడినుండి ఫోన్‌చెయ్యగా మద్రాసునుండి ఇంకో బస్సు వచ్చింది. సాయంకాలం ఆరింటికి రాజు నగరి చేరాడు. ఆ పూటకు అక్కడి నుండి పల్లెపట్టువెళ్ళే ఆఖరి బస్సు వెళ్ళిపోయిందన్నారు. భూమి కుంగిపోయినట్లయింది రాజుకు. పరిస్థితి వివరించగా ఒక్కో సారి పల్లెపట్టువైపు ఏవయినా లారీలు వెళ్తుంటాయని చెప్పారు ఎవరో. అదృష్టవశాత్తు అలాటి లారీ ఒకటి దొరికింది. దాన్నెక్కాడు రాజు. రాత్రి తొమ్మిది గంటలకు పల్లెపట్టులో అడుగు పెట్టాడు రాజు.

కొత్తచోటు. తన అన్వేషణ ఎక్కడనుండి ప్రారంభించాలో కూడా తెలియలేదు రాజుకు. అలా అలా వాకబు చేసుకుంటూ వచ్చాడు. లక్ష్మమ్మ పేరువిని కొందరు అతడి వైపు ఎగా దిగా చూశారు.

రాత్రి పదిన్నరకు మిషన్ స్కూలు కాంపౌండ్ పక్కన వున్న చిన్న పెంకుటింటి ముందర నిలిచాడు రాజు.

దేవుడా, ఇది సరయినఇల్లు కావాలి అనుకుంటూ తలుపు తట్టాడు.

ఒక నల్లటి స్త్రీ—ముప్పైయేళ్ళుంటాయేమో— తలుపు తీసింది. ఆమె చేతిలోని లాంతరు వెలుతురులో తళుక్కుమంది ఆమె ముక్కుపుడకలోని వజ్రం.

"మీరేనా లక్ష్మమ్మగారూ ?" అని అడిగాడు రాజు— గుండె క్షణానికి లక్షసార్లు కొట్టుకుంటూండగా—

"అవును లోపలికి రండి—" అందావిడ.

ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు రాజు.... కళ్ళు తెరిచి గడప దాటాడు.

"కూచోండి ....". రెండేళ్ల కింద చూచిన ఒక ఫోటో గుర్తుకు వస్తూంది ఆమెకు.

"సాయిబాబుని మీ రెరుగుదురా ?"

ఆమె నవ్వింది. "ఎరగకేం .... బాగా ఎరుగుదును .... మహర్షిలాటి మనిషి .... గుంటూరులో ఆయన మా యింటో ఉండేవారు—"

గుంటూరులో ఉండగా ఒక ఉత్తరంలో సాయి పేర్కొన్న మహాలక్ష్మి ఈవిడేనా అనిపించింది రాజుకి.

అడిగితే అవునన్నది ఆవిడ.

"సాయిబాబు ఏడీ—" ఆ ఒక్కొక్క అక్షరంలోనూ ఆతడి జీవితంలోని ఆశలన్నీ ఘనీభవించినాయి.

హఠాత్తుగా మహాలక్ష్మి మొహం మారింది. ఆమె కిటికీగుండా దూరంగా చూసింది. ద్వాదశి వెన్నెల నిశ్శబ్దంగా కురుస్తూంది. పొలాలు నిండి ఆకుపచ్చదనం అల్లనల్ల నాడుతూంది .... ఆమె పెదవులు కదలినట్లున్నాయి.

సాయి మరి లేడు!

రాజు పెద్దగా అరిచాడు.

అవును .... ఆయన లేరు—మెదడులో ఏదో జ్వరంట— అదుగో—ఆ పొలా లవతల మట్టిలో ఆయనను కలిపింది తనే —అంది మహాలక్ష్మి.

కాదు .... ఇదంతా అబద్ధం .... ఎక్కడో పొరబాటు జరిగింది..... సాయి తన్ను విడిచిపోడు .....

మొగుడుని విడిచి వచ్చేసింది తను. మదనపల్లిలో ఉంటూ ఒకసారి తిరుపతి వెళ్లింది. అక్కడ ఒక సత్రపు అరుగుమీద ఆయన కన్పించారు. చాలా జబ్బుగా ఉన్నారు. తనతోబాటు వస్తేకాని కదలనని కూచుంటే వచ్చారు. ఆయనరాక తన బ్రతుకును మార్చివేసింది. అది రెండు నెలల క్రిందట.... డాక్టర్లు ఇంకేమీ లాభం లేదనేసరికి ఏదయినా పల్లెటూరిలోకి—ప్రశాంతతలోకి వెళ్లిపోదా మన్నారు. సరే నన్నది తను. ఇక్కడి కొచ్చిన మూడోరోజు సాయంకాలం ఆ కిటికీ ప్రక్కన కుర్చీలో కూర్చుని ఆ పొలాలను చూస్తూనే ఆ ప్రశాంతతలోకి కలిసిపోయారు. ఆయన ఎందుకలా అయారో తనకు తెలీదు. తా నడగలేదు. ఆయన మాట్లాడేవారుకారు.

నెమ్మదిగా—చాల నెమ్మదిగా రాజుకు తా నింతసేపటి నుంచీ వింటున్న మాటల అర్థం తెలియసాగింది.

అయితే—

అయితే తన సాయిబాబు తనకు కనపడడన్నమాట!

తానేమవాలి ?

భోరుమని పాపాయిలా ఏడిచాడు రాజా.

అతడి కళ్లనీళ్లు తుడిచింది మహాలక్ష్మి.

—తెల్లవారుఝామున, సాయి వదలిపెట్టిన కొన్ని ఉత్తరాలను, ఒకటి రెండు పుస్తకాలనూ తీసుకుని జీవచ్ఛవంలా వెనక్కు బయలుదేరాడు రాజశేఖరం.

మధ్యాహ్నం ఒంటిగంటకు ఇల్లు చేరాడు.

గుమ్మంలో ఎదురయింది మాలతి. కడపకు టెలిగ్రాం ఇప్పించా నన్నది.

జయంతి ఉన్న గదిలోకి వెళ్లాడు. ఆమె ఒళ్లంతా కళ్ళుగా చూసింది— "నేను వెళ్లేదాకా సాయి ఉండలేదు జయా—" మళ్లీ దుఃఖం పొంగింది.....కట్టుబాట్లు తెంచుకుని తాండవించింది.

జయ నెమ్మదిగా తన ప్రక్కన ఉన్న ఉయ్యాలలోని బుల్లిబుల్లి చేతులనూ కాళ్లనూ చూపించింది— "అడిగో నండి సాయిబాబూ!" అంది.

రాజా నవ్వాడు.

22

అయిదు రోజులదాకా రాజు ఉలుకు లేదు. పలుకు లేదు. యంత్రంలా తిన్నాడు. నిద్రపోయాడు. లేచాడు. మాలతి కిదేమి అర్థంకాలేదు. ఆ రోజు సాయంకాలం రాజు వెళ్లి సాయి గదిని ఖాళీచేశాడు. అక్కడి కాగితాలూ, డైరీలూ అన్నీ తెచ్చాడు. వా టన్నిటినీ తగలబెట్టడానికి ఆ రాత్రి కూర్చున్నాడు.

ఒక్కొక్క డైరీయే మండిపోతూంటే ఒక్కొక్క రెక్క రాలిపోతున్న పక్షిలా కొట్టుకుంది అతడి హృదయం. ఎన్ని ఉత్తరాలు—అందులో చాలా వరకు తాను రాసినవి— ఎన్ని జ్ఞాపకాలు—అన్నీ కరిగిపోతున్నాయి ..... అయిపోయింది.... ఇంకొక కట్ట మాత్రమే ఉంది. అది తీశాడు రాజా.

ఒక కార్డు ఉంది .... దానిమీద అక్షరాలు పెద్దగా, వంకరగా, ఎక్కువ చదువుకోనివాళ్లు రాసినట్లున్నాయి.

ఆ ఉత్తరం రాసిన సాయి తల్లి ఎక్కువగా ఏం చదువుకుంది గనుక—

కొత్తగా ఉన్న ఆ చేతి రాతను కాస్త గమనించి చూశాడు రాజా. అక్కడ కొన్ని అక్షరాలు అగ్నిశిఖలై నిలిచాయి.

'.... నువ్వు పెళ్లి చేసుకోదలచిన తర్వాత నీ మిత్రుడి కోసం ఆగడం అనవసరం. నువ్వు నీకు నచ్చిన ఆ జయంతిని చేసుకో ...... ఆశీస్సులు—అమ్మ'

—బెడ్‌రూములో కాబోలు టేబిల్‌ఫోన్ హోరు మంటూ తిరుగుతూంది.